

నేడు ఇరగవరంలో చంద్రబాబు పోరుబాట

ప్రజాశక్తి - తణుకు

టిడిపి అధినేత, మాజీ సిఎం చంద్రబాబు ఈనెల 12న తణుకు నియోజవర్గంలో రైతుపోరుబాట చేపట్టనున్నారు. మండల కేంద్రమైన ఇరగవరంలోని శ్రీమద్ది ఆంజనేయస్వామి గుడివద్ద నుంచి ఉదయం ఎనిమిది గంటలకు చంద్రబాబు పాదయాత్ర ప్రారంభంకానుంది. అక్కడ నుండి పాదయాత్ర ద్వారా రైతులను పరామర్శిస్తూ, వారికష్టాలను తెలుసుకుంటూ ముందుకుసాగుతారు. ఉదయం 11 గంటల వరకూ యాత్రసాగుతుంది. అనంతరం శ్రీకన్య పెట్రోల్‌బంకు వద్ద కొద్దిసేపు విశ్రాంతి తీసుకుంటారు. తిరిగి సాయంత్రం మూడు గంటలకు పాదయాత్ర ప్రారంభమవుతుంది. మైత్రి గార్డెన్స్, మున్సిపల్ కార్యాలయం, నరేంద్ర సెంటర్ వెంకటేశ్వర థియేటర్ సెంటర్, తణుకు ఫ్లైఓవర్ మీదగా ఆకుల శ్రీరాములు డిగ్రీ కళాశాల వద్ద సాయంత్రం జరిగే బహిరంగ సభావేదికకు చేరుకుంటారు.

బటన్ నొక్కారు.. డబ్బులేవి..!

45 రోజులైనా జమకాని 'ఆసరా' సొమ్ము
ఉమ్మడి పశ్చిమలో 65 వేలకు పైగా డ్వాక్రా గ్రూపులు
70 శాతం సంఘాలకే డబ్బు జమ
'వసతి దీవెన' పథకమూ అదే పరిస్థితి
బటన్‌నొక్కి 15 రోజులైనా అందని వసతి దీవెన సొమ్ము
హాస్టల్ ఫీజులు చెల్లించలేక విద్యార్థుల అవస్థలు
పథకాల సొమ్ము ఆలస్యంపై జనాల్లో తీవ్ర చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సంక్షేమ పథకాల కింద ప్రభుత్వం జమచేసే సొమ్ములు లబ్ధిదారులకు ఎప్పటికి జమవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. సిఎం బటన్‌నొక్కి నెలలు గడిచిపోతున్నా ఇప్పటి వరకూ సగమంది లబ్ధిదారులకు కూడా ఖాతాలకు సొమ్ము చేరలేదు. 45 రోజుల క్రితం దెందులూరులో బటన్‌నొక్కి విడుదల చేసిన డ్వాక్రా సంఘాల ఆసరా సొమ్ముగానీ, 15 రోజు క్రితం ఆనంతపురంలో బటన్ నొక్కి విద్యార్థులకు ఇస్తున్న వసతి దీవెన నగదుగానీ ఇప్పటికీ పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు చేరలేదు. దీంతో సంక్షేమ పథకాల లబ్ధిదారుల్లో ఇది తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

2019 ఏప్రిల్ 11వ తేదీ వరకూ ఉన్న డ్వాక్రా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను నాలుగు విడతలుగా మాఫీ చేస్తామని ఎన్నికలకు ముందు వైసిపి హామీ ఇచ్చింది. డ్వాక్రా సంఘాలకు చేసే ఈ ఆర్థికసాయానికి 'ఆసరా' పథకంగా ప్రభుత్వం నామకరణం చేసింది. రెండు విడతల సొమ్ము జమచేయగా మూడో విడత సొమ్ము మార్చి 25వ తేదీన ఏలూరు జిల్లా దెందులూరులో సిఎం బటన్‌నొక్కి విడుదల చేశారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 65,417 డ్వాక్రా సంఘాలున్నాయి. ఏలూరు జిల్లాలో 39,539 సంఘాల్లో 3,89,446 మంది సభ్యులున్నారు. వీరికి మూడో విడతగా రూ.364.39 కోట్లు జమచేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. పశ్చిమలో 25,878 గ్రూపులుండగా రూ.266.67 కోట్లు జమచేయాల్సి ఉంది. సిఎం బటన్ నొక్కిన తర్వాత ఎంఎల్‌ఎలు అంతా వారివారి నియోజకవర్గాల్లో డెమో చెక్కుల పంపిణీ చేసి హడావుడి చేశారు. ఆసరా సొమ్ము విడుదలకు సంబంధించి సిఎం బటన్‌నొక్కి 45 రోజులు గడిచింది. ఇప్పటి వరకూ సగానికి పైగా గ్రూపులకు మాత్రమే ఆసరా సొమ్ము జమ అయింది. మిగిలిన గ్రూపులకు ఎప్పటికి జమవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. పశ్చిమలో ఇప్పటి వరకూ దాదాపు 12 వేల గ్రూపులకు రూ.120 కోట్లు జమైనట్లు తెలిసింది. ఇంకా 14 వేలకుపైగా గ్రూపులకు రూ.145 కోట్ల వరకూ జమకావాల్సి ఉంది. ఏలూరు జిల్లాలో 39,539 డ్వాక్రా సంఘాల్లో 70శాతం పైగా గ్రూపులకు నగదు జమైనట్లు తెలుస్తోంది. ఆసరా డబ్బు జమకాకపోవడం డ్వాక్రా సభ్యుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇంకా డబ్బులు జమకావడానికి 15 రోజులు పట్టొచ్చని అధికారులు చెబుతుండటంతో ఇదేం తీరంటూ డ్వాక్రా సంఘాల మహిళలు ప్రశ్నిస్తున్నారు.




'వసతి దీవెన' పరిస్థితి అదేదారి

హాస్టల్లో చదువుకునే పేద విద్యార్థులకు భోజనం, వసతి కింద ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని ఎన్నికలకు ముందు సిఎం జగన్ ప్రకటించారు. ఈ సొమ్ము జమ కూడా సవ్యంగా జరగలేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ ఏడాదికి సంబంధించి ఏప్రిల్ 26వ తేదీన అనంతపురంలో వసతి దీవెన సొమ్ము విడుదలకు సిఎం బటన్‌నొక్కారు. 15 రోజులు గడిచిపోయింది. ఇప్పటికీ ఒకటో వంతు విద్యార్థులకు కూడా ఈ సొమ్ము జమకాలేదు. ఏలూరు జిల్లాలో వసతిదీవెన అందుకునే విద్యార్థుల సంఖ్య 33,316 వరకూ ఉంది. జమకావాల్సిన సొమ్ము రూ.30.96 కోట్లు. ఇప్పటి వరకూ జమైన సొమ్ము రూ.మూడు కోట్లలోపే ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకూ ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు మాత్రమే జమయ్యాయని, బిసి, ఇతర సామాజిక తరగతుల విద్యార్థులకు జమకావాల్సి ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలో వసతి దీవెన అందుకునే విద్యార్థులు 33,231 మంది ఉన్నారు. మొత్తం రూ.31.69 కోట్లు జమకావాల్సి ఉంది. ఈ జిల్లాలోనూ ఒకటో వంతు విద్యార్థులకు మాత్రమే ఈ సొమ్ము జమైనట్లు చెబుతున్నారు. మిగిలిన విద్యార్థులకు సొమ్ము జమకావడానికి 15 రోజులు సమయం పట్టే అవకాశం ఉందని చెబుతున్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. చివరి నాలుగో ఏడాది ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులంతా ఈనెల ఆరోతేదీకి చదువుపూర్తయింది. హాస్టల్ ఖాళీచేసి వచ్చేశారు. హాస్టల్ సొమ్ము మొత్తం చెల్లించాలని కాలేజీ యాజమాన్యాలు పట్టుబడుతున్నాయి. దీంతో వసతిదీవెన సొమ్ములు జమకాకపోవడంతో అప్పు చేసి చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రైతు భరోసా, అమ్మఒడి పరిస్థితి ఏమిటి?

ఖరీఫ్ ఆరంభంలో రైతుభరోసా, స్కూల్స్ ప్రారంభమయ్యేనాటికి అమ్మఒడి పథకాలకు సంబంధించిన సొమ్ము విడుదల చేయాల్సి ఉంది. బటన్‌నొక్కిన పథకాలకు సంబంధించిన సొమ్ములే ఇంకా జమకాలేదు. బటన్ నొక్కాల్సిన పథకాల సొమ్ము ఎప్పటికి జమవుతుందోనన్న చర్చ లబ్ధిదారుల్లో కొనసాగుతోంది.



రచ్చబండలో మాట్లాడుతున్న చంద్రబాబు

రైతులను దగా చేస్తోన్న వైసిపి

ప్రభుత్వానికి అన్నదాత అంటే లెక్కలేదు
మిల్లర్లు ఏమైనా పెత్తందారులా..?
నూక పేరుతో రైతులను దోపిడీ చేయడం దారుణం
ఇరగవరం రచ్చబండలో చంద్రబాబు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి/తణుకు రూరల్

'వైసిపి ప్రభుత్వానికి రైతులంటే లెక్కలేదు.. వారిని దగా చేస్తుంది.. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై రైతుల్లో చర్చ జరగాలి. వారిలో చైతన్యం రావాలి. అప్పుడే రైతుల సమస్యలు పరిష్కారమవుతాయి. ఈ క్రమంలో వారికి టిడిపి నిత్యం అండగా ఉంటుంది.' అని పార్టీ అధినేత, మాజీ సిఎం చంద్రబాబు అన్నారు. గురువారం సాయంత్రం పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరంలో ఆయన పర్యటించారు. సాయంత్రం 7.30 గంటలకు తణుకు పట్టణానికి చంద్రబాబు చేరుకున్నారు. తొలుత మాజీఎంఎల్‌ఎ వైటి.రాజా నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. అనంతరం రోడ్డు మార్గంగుండా ఇరగవరం చేరుకుని పంచాయతీ చెరువు సమీపంలో ఉన్న ఆలయం వద్ద రైతులతో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు కోటిలింగం, ద్వారపూడి సుబ్బరెడ్డి, మరికొందరు రైతులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో రైతులు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అదనంగా ఎదురు డబ్బులు కట్టించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలకు కోత ఖర్చులతో పాటు పెట్టుబడులు భారీగా పెరిగాయన్నారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వానికి జవాబుదారీతనం ఉండాలని, మిల్లర్లు పెత్తందారులు కాదన్నారు. 40 కిలోల బస్తాకు రెండు కిలోలు అదనంగా, వంద కిలోల బస్తాకు ఐదు కిలోలు తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలు చేయాలని 72 గంటలు అల్టిమేటం ఇచ్చి వివిధ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. రబీ సీజన్‌లో పండిన పంటను ఆన్‌లైన్ పేరుతో తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ధాన్యం వెళ్లిన తర్వాత మిల్లర్లు ఫోన్ చేసి డబ్బులు కట్టించుకుంటున్నారని తెలిపారు. ఇక్కడి ధాన్యం వేరే మిల్లుకు, అక్కడి ధాన్యం ఇంకో మిల్లుకు పెడుతూ తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని చంద్రబాబుకు వివరించారు. తాను సిఎంగా ఉండగా తుపాన్‌లు వచ్చినప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్య పరిష్కరించేవాడినని, ఈ ప్రభుత్వం రైతుల సమస్యలు తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలోకి రావడంలేదన్నారు. జగన్ తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చొని సొంత ప్రయోజనాలు చూసుకుంటున్నారన్నారు. ఇక్కడ ఉండే పౌర సరఫరాల శాఖ మంత్రి రైతులను ఎర్రిపప్ప, బుజ్జినాన్న అని పిలుస్తూ హేళనగా మాట్లాడటం తగదన్నారు. తాను వస్తుంటే దారి పొడవునా వైసిపి ఫ్లెక్సీలు కడుతూ సైకో ఆనందం పొందుతున్నారన్నారు. 40 సంవత్సరాల రాజకీయాల్లో ఇలాంటి పరిస్థితి చూడలేదన్నారు. రచ్చబండ కార్యక్రమం జరుగుతుండగా మధ్యలో ఒక వ్యక్తి లేచి మీరు అధికారంలో ఉన్నప్పుడు ఆయన, ఆయన అధికారంలో ఉన్నప్పుడు తమరు జనాల్లో తిరుగుతున్నారని, అసెంబ్లీలో సమస్యలు ప్రస్తావించడం లేదని అన్నారు. దీనిపై చంద్రబాబు మాట్లాడుతూ అసెంబ్లీలో బూతులు మాట్లాడుతున్నారని, అక్కడ న్యాయం జరగడంలేదని, అందుకే క్షేత్రస్థాయిలో కూర్చున్నామన్నారు. మాట్లాడిన వ్యక్తి వైసిపికి చెందినవారంటూ అక్కడ ఉన్న టిడిపి నాయకులు పక్కకు తీసుకెళ్లారు. చంద్రబాబు జిల్లా పర్యటనకు వచ్చే సమయంలో ఉంగుటూరు చేరుకునేసరికి రెండు వాహనాలు చంద్రబాబు కాన్వాయ్‌లోకి చొరబడి తాడేపల్లిగూడెం చేరుకున్నాక పక్కకు వెళ్లిపోయినట్లు టిడిపి నాయకులు ఆరోపించారు. దీనిపై ఎస్కార్ట్ పోలీసులు స్పందించలేదంటూ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వ విధానలపై రైతుల్లో చర్చజరగాలని, చైతన్యం వచ్చినప్పుడే మన సమస్యలు పరిష్కారమవుతాయని, రైతులు ఎకరాకు రూ.పదివేల వరకూ నష్టపోతున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుదామన్నారు. తహశీల్దార్లు కూడా హమాలీలుగా మారారని, ఇంతటి దారుణమైన పరిస్థితులు ఎప్పుడూ చూడలేదన్నారు. అమరావతిని చిదిమేశారని చంద్రబాబు విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు పత్తిపాటి పుల్లారావు, జవహర్, పీతల సుజాత, ఆరిమిల్లి రాధాకృష్ణ, శేషరావు పలువురు పాల్గొన్నారు. శుక్రవారం ఇరగవరం నుంచి తేతలి వరకూ చంద్రబాబు పాదయాత్ర సాగనుంది. అనంతరం బహిరంగ సభలో ఆయన మాట్లాడనున్నారు.

రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు : టిడిపి

భీమవరం:చేతికొచ్చిన పంట అకాల వర్షానికి దెబ్బతిని రైతులను నష్టాలపాల్జేసిందని, ఇలాంటి సమయంలో రైతుల పట్ల ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం వహిస్తుందని, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని టిడిపి నేతలు డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ వద్ద టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఎంఎల్‌ఎలు, మాజీ ఎంఎల్‌ఎలు, మాజీ మంత్రులు, నేతలు నాయకులు కార్యకర్తలు రైతులు తరలివచ్చారు. పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, తడిసిన ధాన్యం, వరి కంకులతో వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాల వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతే ధాన్యం కొనుగోలులో అక్రమాలకు పాల్పడుతున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని నిబంధనలు సడలించి కొనుగోలు చేయాలని, గోనెసంచులు అందించి సకాలంలో డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేయాలని నినాదాలు చేశారు. స్థానిక తిరుమల విద్యా సంస్థల నుంచి ర్యాలీగా వెళ్లి జిల్లా రెవెన్యూ అధికారి కృష్ణవేణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీమంత్రి పితాని సత్యనారాయణ మాట్లాడుతూ ఇటీవల భారీవర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ అకాల వర్షాలకు రైతులు తీవ్రనష్టాలు చవిచూశారన్నారు. ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు మాట్లాడుతూ నష్టపోయిన రైతులను ఓదార్చాల్సిన మంత్రి కారుమూరి నాగేశ్వరరావు వేర్రిపప్ప అని హేళనగా మాట్లాడటం సరికాదని విమర్శించారు. మాజీమంత్రి పీతల సుజాత మాట్లాడుతూ ఈనెల 12న తణుకులో నిర్వహించనున్న చంద్రబాబు రైతుపోరుబాట జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సిపిఎస్ రద్దు కోరుతూ ఆగస్టు 12న 24 గంటల నిరాహార దీక్ష

ప్రజాశక్తి - భీమవరం

సిపిఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆగస్టు 12వ తేదీన అన్ని జిల్లాకేంద్రాల్లో 24 గంటల పాటు నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు ఎస్‌టిఎఫ్‌ఐ జనరల్ కౌన్సిల్ పిలుపునిచ్చిందని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి తెలిపారు. సిపిఎస్ రద్దు చేయాలని, ఎన్ఎపి విధానాన్ని ఉపసంహరించాలని, చరిత్ర పాఠాలు తొలిగించి, చరిత్రను వక్రీకరించే పాఠాలను ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ నిరాహారదీక్ష చేయాలని కేరళలో జరుగుతున్న స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ పిలుపునిచ్చిందన్నారు. ప్రధానంగా 2004 నుండి అమలవుతున్న సిపిఎస్ వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. కొన్ని రాష్ట్రాలు పాతపెన్షన్‌లోకి మారినా ఇంకా కొన్ని రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం సిపిఎస్‌ని రద్దు చేయకపోగా, ఉద్యోగ, ఉపాధ్యాయుల నుండి సేకరించిన ఎన్ఎస్‌డిఎల్ వద్ద ఉన్న సొమ్ము తిరిగి ఇవ్వాలని బెదిరించడం సరికాదని విమర్శించారు. వెంటనే సిపిఎస్ రద్దు కోసం 2013లో చేసిన పిఎఫ్ఆర్‌డిఎ చట్టాన్ని రద్దు చేసి, పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. విద్యలో మత తత్వీకరణకు పునాది వేసే జాతీయ విద్యావిధానం 2020ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ సూత్రాలైన లౌకికవాదం, ప్రజాస్వామ్యం సూత్రాలకు భిన్నంగా అంధవిశ్వాసాలను పెంపొందించడానికి అనుగుణంగా జాతీయ విద్యావిధానం ఉందని విమర్శించారు. సృజనాత్మకత, ప్రశ్నించేతత్వాన్ని పెంపొందించే విద్యావిధానాన్ని రూపొందించి అమలుచేయాలని కోరారు. గాంధీ, భగత్‌సింగ్ పాఠాలతో పాటు, శాస్త్రీయంగా నిరూపణకు నిలబడిన డార్విన్ పరిణామవాదాన్ని తొలిగించడం ద్వారా శాస్త్రీయ అంశాలు భవిష్యత్‌తరాలకు తెలియకుండా చేయడానికి చేసే ప్రయత్నంగా చూడాలన్నారు. కేంద్రం చేస్తున్న ఇలాంటి అప్రజాస్వామిక విధానాలకు వ్యతిరేకంగా నిరాహార దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు.

జగనన్న లే అవుట్లకు భూములిచ్చిన రైతులకు పరిహారమివ్వకపోవడం సిగ్గుచేటు

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోపాలన్

ప్రజాశక్తి - పాలకోడేరు

జగనన్న ఇళ్ల స్థలాలకు నిరుపేదల నుంచి భూములు తీసుకుని ఏళ్లు గడుస్తున్నప్పటికీ పరిహారం అందించకపోవడం సిగ్గుచేటని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ విమర్శించారు. తక్షణం నిరుపేద రైతు కుటుంబాలకు పరిహారం అందించాలని, లేనిపక్షంలో బాధితులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. పాలకోడేరు కోటిగట్టు జగనన్న లే అవుట్‌కు భూములిచ్చిన రైతు కుటుంబాలను సిపిఎం నేతలు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ నిరుపేదలకు జీవనాధారమైన భూములను ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కోసం సేకరించిందన్నారు. సుమారు మూడు దశాబ్దాల క్రితం ఇతర పేదల దగ్గర కొనుగోలు చేసిన భూమిని వీరంతా సాగు చేసుకుని జీవిస్తున్నారని పేర్కొన్నారు. ఈ భూములు గ్రామానికి దగ్గర్లో ఉండటం వల్ల అధికారులు నష్టపరిహారం ఇప్పిస్తామని నమ్మబలికి వారి అంగీకారం తీసుకుని భూములను తీసుకున్నారని తెలిపారు. భూములు తీసుకున్న తరువాత అధికారులు బాదితులకు నష్టపరిహారం రాదని చెప్పడం అన్యాయమన్నారు. నష్టపరిహారం రాదని తెలిసినప్పుడు నిరుపేదల వద్ద ఇళ్ల స్థలాల కోసం భూమిని ఎందుకు తీసుకోవాలని ప్రశ్నించారు. ఏళ్ల తరబడి ఇవే భూములను జీవనాధారం చేసుకుని బతికేవారంతా ఇప్పుడు ఎలా బతకాలన్నారు. ఎసైన్డ్ భూములు చేతులు మారకూడదని చెప్పే ప్రభుత్వం జిల్లావ్యాప్తంగా బడాబాబుల చేతుల్లో ఉన్న అసైన్డ్ భూములను వెనక్కి తీసుకునే దమ్ముందా అని ప్రశ్నించారు. భూస్వాములు, బడాబాబుల జోలికి వెళ్లేందుకు ఈ ప్రభుత్వానికి ధైర్యం లేదన్నారు. పేదలకు నష్టపరిహారం ఇవ్వాలని లేకపోతే వారి భూములు తిరిగి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యకాస నాయకులు శేషపు అశ్రియ, నాయకులు పాల్గొన్నారు.



బాధితులను పరామర్శించి మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ రామరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోపాలన్

బాధితులకు న్యాయం చేయాలి :ఎమ్మెల్యే రామరాజు

ప్రభుత్వ ఇళ్ల స్థలాలకు భూములిచ్చి మోసపోయిన రైతు కుటుంబాలకు అండగా ఉంటామని ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు స్పష్టం చేశారు. పాలకోడేరులో ప్రభుత్వ ఇళ్ల స్థలాలకు భూమిలిచ్చి మోసపోయిన రైతులను ఎంఎల్‌ఎ పరామర్శించి మాట్లాడారు. నిరుపేదల అనుభవంలో ఉన్న ఎసైన్డ్ భూమికి నష్టపరిహారం ఇచ్చేందుకు వెసులుబాటు లేకపోయినా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా న్యాయం చేయాలని కోరారు. విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం జరిగేలా ప్రయత్నిస్తానన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర కృషి

కమ్యూనిటీ హాలుకు ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి శంకుస్థాపన

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నిజయోజక వర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. పట్టణంలోని 8వ వార్డులో రూ.15 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్‌కు, వైఎన్ కళాశాలలో రూ.12 లక్షలతో వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి సచివాలయానికీ రూ.20 లక్షల నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు.



ముదునూరి ప్రసాదరాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నేతలు

ఇంటింటికీ పర్యటించినప్పుడు ప్రజల కోరిక మేరకు సుమారు 21 గ్రామాల్లో కమ్యూనిటీ భవనాలు నిర్మిస్తున్నామన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు వారి కుటుంబంలో జరిగే చిన్న చిన్న శుభకార్యాలను ఈ కమ్యూనిటీ భవనాల్లో నిర్వహించుకోవచ్చన్నారు. రాష్ట్రంలోని సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఇవ్వడమే రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ జయరాజు, కౌన్సిలర్లు, నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సూక్ష్మ సేద్య పరికరాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ప్రాజెక్ట్ డైరెక్టర్ వీరభద్రరావు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో డ్రిప్ సూక్ష్మ సేద్య పరికరాలను ప్రభుత్వం అందిస్తున్న రాయితీపై పొందేందుకు రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.వీరభద్రరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాకు 2023 - 24 సంవత్సరానికి గాను 500 హెక్టార్లు లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. 2022-23లో రిజిస్ట్రేషన్ చేసికొని పరిపాలనా ఉత్తర్వులు పొందని రైతుల రిజిస్ట్రేషన్లను 2023-24 సంవత్సరానికి బదిలీ చేయడం జరిగిందన్నారు. ఈ ఏడాది మరల రిజిస్ట్రేషన్ చేసికోవాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఈ పథకం కిందలో అన్నిరకాల పండ్లూ కూరగాయలు, పూలతోటకు రాయితీపై డ్రిప్, స్పింక్లర్స్ (బిందు సేద్య పరికరాలు, తుంపర సేద్య పరికరాలు) అందించడం జరుగుతుందని తెలిపారు. ఐదెకరాల్లోపు చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీ, ఐదెకరాలు పైబడిన రైతులకు 50 శాతం సబ్సిడీపై పరికరాలు అందించనున్నట్లు తెలిపారు. డ్రిప్ కంపెనీలు సుధారక్, నెటాఫిమ్, గ్లోబల్ కంపెనీల సామగ్రిని మాత్రమే రాయితీపై అందిస్తామని పేర్కొన్నారు. పరికరాలు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, భూ యాజమాన్య పత్రం, బ్యాంకు ఖాతా ఫొటో కాపీలు జతచేసి, దగ్గరలోని ఆర్‌బికె గ్రామ ఉద్యాన సహాయకులు విహెచ్‌ఎ, విఎఎలకు అందించాలని కోరారు. మరింత సమాచారం కోసం జిల్లా సూక్ష్మ నీటి సేద్య అధికారి, పి.వీరభద్రరావు నంబరు 7995087043ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

పట్టణాభివృద్ధికి కృషి : ఎంఎల్‌ఎ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం పట్టణ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. గురువారం పట్టణంలోని ఏడో వార్డులో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ముందుగా రూ.25 లక్షలతో నూతనంగా నిర్మించనున్న రజకుల పేటలోని రజకుల కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.38 లక్షలతో కముజువారిపాలెంలో నిర్మించే ఇంటర్నల్ సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వార్డునూ అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ వార్డు ప్రజల ఆకాంక్షను నెరవేర్చడం జరిగిందని పేర్కొన్నారు. వార్డుల్లో ఇంకా ఎక్కడైనా అభివద్ధి పనులు జరగాల్సి ఉందని ప్రజలు కోరుకుంటే ఆ వివరాలను తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. భీమవరం పట్టణాభివృద్ధి నాడు నేడు కూడా తన హయాంలోనే జరిగిందన్నారు. ప్రజల కోరిక మేరకు భీమవరంలో జిల్లా కేంద్రాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసుకోగలిగామన్నారు. ఉన్నతాధికారులు అందుబాటులో ఉండడం, మున్సిపల్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ పి.ప్రశాంతి పనిచేస్తుండడంతో భీమవరం పట్టణాన్ని రాష్ట్రస్థాయిలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి రేయింబవళ్లు కృషి చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ వేండ్ర వెంకటస్వామి, వాసర్ల ముత్యాలరావు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్

విద్యార్థులు అద్భుత ఆవిష్కరణలు రూపొందించాలి

ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ ప్రమోద్ పడోలే

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విద్యార్థులు తమ ఆలోచనలకు పదునుపెడితే అద్భుత ఆవిష్కరణలు రూపుదిద్దుకుంటాయని ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే సూచించారు. జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని పురస్కరించుకుని నిట్ కళాశాల ఆధ్వర్యంలో 'ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్డ్ రీసెర్చ్' అంశంపై రెండు రోజులపాటు నిర్వహించనున్న వర్క్‌షాప్‌ను గురువారం నిట్ రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రమోద్ పడోలే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. విద్యార్థులు నిట్ ఆచార్యుల సూచనలు, సలహాలను పాటిస్తూ వారి మార్గదర్శకత్వంలో కొత్త కొత్త ఆలోచనలు, ప్రాజెక్టులతో నూతన అధ్యాయనానికి శ్రీకారం చుట్టాలన్నారు. నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల పరిశోధనలు దేశానికే దిక్సూచి వంటివన్నారు. నూతన పరిశోధనలతోనే వైజ్ఞానిక పురోగతి సాధ్యమవుతుందన్నారు. ఆధునిక సాంకేతికతలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ఇన్‌స్పైర్ అవార్డుకు రాష్ట్రంలోని 35 మంది ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులను ఎంపిక చేశారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో త్వరలో నిర్వహించనున్న జాతీయస్థాయి ఎగ్జిబిషన్‌కు ఈ 35 మంది విద్యార్థులు తరలి వెళ్లనున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జిబి.వీరేష్ కుమార్, ఎపి ఎడ్యుకేషన్ కౌన్సిల్ స్టేట్ నోడల్ ఆఫీసర్ భాగ్యశ్రీ, ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి


భగ్గేశ్వరంలో పర్యటించి స్థానికులతో మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్మన్

భగ్గేశ్వరంలో జెడ్‌పి ఛైర్మన్ పర్యటన

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో విలీనమైన భగ్గేశ్వరం ఏరియాలో మున్సిపల్ అధికారులతో కలిసి జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ శుక్రవారం పర్యటించారు. గ్రామంలో పలు పోట్ల సీసీ డ్రెయినేజీ నిర్మాణాలు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బిఆర్ఎస్.శేషాద్రి, జెడ్‌పిటిసి నడపన గోవిందరాజులు, మండల కన్వీనర్ మైఖేల్ రాజు నాయకులు పాల్గొన్నారు.


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యకాస నేతలు

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పెనుగొండ

కోట్ల మంది గ్రామీణ పేదలకు పట్టెడన్నం పెడుతున్న ఉపాధి హామీ చట్టం నేడు ప్రమాదంలో పడిందని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి షేక్ పాదుషా అన్నారు. గురువారం పెనుగొండ అడ్డపుంత, కొటాలపర్రులో పని ప్రాంతంలో ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడం కోసం ఉపాధి హామీలో నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం యాప్‌ను తెచ్చిందన్నారు. రెండు పూటలా పని విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. దీనివల్ల ఉపాధి కూలీలకు తీవ్ర నష్టం కలుగుతుందని, ఈ పథకాన్ని ఎత్తివేయడం కోసం బిజెపి చేసిన అనేక కుట్రల్లో భాగంగా కూలీలకు వేతనాలు, సమ్మర్ అలవెన్స్, మెట్ల పారితోషకం, ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు పాల్పడుతోందన్నారు. కూలీలకు పోస్టాఫీసుల ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 12న భీమవరం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఉపాధి కూలీలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ కృషి అభినందనీయం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మహిళల రక్షణకు దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్‌లో సభ్యులుగా చేరిన పలువురికి గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో గుర్తింపు కార్డులు అందజేశారు. ఫౌండేషన్ రాష్ట్ర కోశాధికారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ఎక్కడా లేని విధంగా జగన్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి యాప్‌ను రూపకల్పన చేసి దిశ చట్టం తీసుకొచ్చారన్నారు. మహిళలు పనిచేసే ప్రదేశంలో గానీ ఖాళీ ప్రదేశంలో గానీ ఇంట్లో గానీ ఎటువంటి ఇబ్బందులు పడకుండా రక్షణ కల్పించేందుకు దిశ చట్టం దోహదపడుతుందన్నారు. అలాగే మహిళలకు రక్షణ కల్పించేందుకు వారి సమస్యలను తమ సమస్యగా భావించి పరిష్కరించేందుకు జాతీయ స్థాయిలో దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. నియోజకవర్గంలో పని చేసేందుకు పలువురు మహిళలు ముందుకు రావడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ద్వారకాతిరుమల దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ ముప్పిడి సంపత్ కుమార్, వివిధ గ్రామాలకు చెందిన దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌ఎ పెంపుపై హర్షం

కలెక్టరేట్‌లో ఉద్యోగుల సందడి

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వం హెచ్‌ఆర్‌ఎ పెంచడం పట్ల భీమవరం కలెక్టరేట్లో ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తూ గురువారం పరస్పరం స్వీట్లు పంచుకున్నారు. ఈ నేపథ్యంలో కోలాహలంగా మారింది. దీనిలో భాగంగా జిల్లా రెవెన్యూ అధికారి కృష్ణవేణికి ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందజేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఎపి ఎన్‌జిఒస్ కలెక్టరేట్ కార్యాలయ ఛైర్మన్ వై.దుర్గా కిషోర్, జాయింట్ సెక్రటరీ వివి పెద్దిరాజు మాట్లాడారు. ఎపి జెఎసి అమరావతి నాయకత్వం ఆధ్వర్యంలో 63 రోజుల ఉద్యోగుల అలు పెరగని పోరాట ఫలితంగా హెచ్‌ఆర్‌ఎ సాధించుకున్నామన్నారు. 12 శాతం నుంచి 16 శాతం హెచ్‌ఆర్‌ఎ పెంచడం ఆనందంగా ఉందన్నారు. అంతా కలిసికట్టుగా ఉండి డిమాండ్స్‌పై పోరాడితే మరిన్ని ఫలితాలు వస్తాయన్నారు. ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలివే

ప్రజాశక్తి - పాలకొల్లు


ఈ నెల 12వ తేదీ శనివారం నరసాపురం నుంచి పాలకొల్లు వెళ్లే 33 కెవి లైన్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 7.00 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాకు నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇఇ బి.సురేష్ కుమార్ తెలిపారు. పట్టణంలోని శంభునిపేట, వరిధనం రోడ్, బ్రాడీపేట, మెయిన్ రోడ్డు, మారుతీ థియేటర్ రోడ్డు, కెనాల్ రోడ్డు, రాజీవ్‌నగర్, మావుళ్లమ్మపేట, నాగరాజుపేటలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాడేపల్లిగూడెం : శుక్రవారం 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో హౌసింగ్ బోర్డు, పాతూరు, మహాలక్ష్మీనగర్‌లో మరమ్మతుల నిమిత్తం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. వెంకటరత్నం హాస్పిటల్ ఏరియా, జూబ్లీ రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, పాతూరు, మహాలక్ష్మీనగర్ ఫీడర్లు, పిటి కాలనీ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఆరేడులో గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి - ఉండి

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయో లేదో చూసి పరిశీలించడమే గడపగడపకూ మన ప్రభుత్వం ముఖ్యోద్దేశమని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆరేడులో రెండో రోజు ఆయన గడపగడపకూ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతోందీ లేనిదీ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలు ఆయన దృష్టికి పలు సమస్యలను తీసుకొచ్చారు. సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారన్నారు. కులమతాలు, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం వైసిపి ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శ్రీహరి నారాయణరాజు, జానపద సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, మండల కన్వీనర్ ఆంజనేయరాజు, రఘు తదితర నాయకులతోపాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


కరపత్రాలు అందజేస్తున్న డిసిసిబి ఛైర్మన్ నరసింహరాజు

విద్యా ప్రదాత.. ఎంపిపి చంటిరాజు

పదో తరగతి విద్యార్థుల సత్కార సభలో వక్తలు

ప్రజాశక్తి - పాలకోడేరు

ఉపాధ్యాయులకు సహకరిస్తూ, విద్యార్థులను ప్రోత్సహిస్తూ విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తున్న పాలకోడేరు మండల పరిషత్ అధ్యక్షులు భూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటిరాజు) విద్యా ప్రదాత అని పలువురు వక్తలు కొనియాడారు. ఇటీవల విడుదలైన పది పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వేంద్ర భూపతి రాజు సుబ్బతాత రాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎంపిపి చంటిరాజు ఆధ్వర్యంలో మెమెంటోలు, బహుమతులు అందజేసి ఘనంగా సత్కరించారు. 566 మార్కులతో మండల ద్వితీయ, పాఠశాల ప్రథమ స్థానాలు సాధించిన తోట దేవిశ్రీ సాయి శ్రీకర్‌తో పాటు ప్రతిభ చూపిన వెంకట అవినాష్, సూర్య మాధురి, పాల తనూజ, గౌతమ్ కుమార్, ప్రశాంత్‌కుమార్, జయ మౌనికను సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సత్కార సభకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.హరిఆనంద్‌ప్రసాద్ అధ్యక్షత వహించి మాట్లాడారు. పాఠశాల, విద్యాభివృద్ధితోపాటు ఉపాధ్యాయులకు విద్యార్థులకు ఎంపిపి అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఎంపిపి చంటి రాజు మాట్లాడుతూ ఈ ఏడాది పరీక్షా ఫలితాల్లో పాఠశాలకు ఉత్తమ ఫలితాలు రావడం, గ్రామానికి పేరు ప్రతిష్టలు తీసుకురావడం అభినందనీయమన్నారు. విద్యతోనే విద్యార్థుల భవిష్యత్తు మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కడలి నాగేశ్వరి, ఎంపిటిసి పాల జ్యోతి, ఉపసర్పంచి భూపతి రాజు సుబ్బరాజు, విద్యా కమిటీ ఛైర్మన్ బి.నాగరాజు, మాజీ ఛైర్మన్లు వేణు, శ్యాంబాబు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు కిరణ్, బాలాజీ, గోపీ రమణ, దేవరాజు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు .


ఉత్తమ విద్యార్థులతో ఎంపిపి చంటిరాజు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు

కాళ్లకూరులో మోక్షధామం ఆధునికీకరణ పనులు

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరులో మోక్షధామం ఆధునికీకరణ పనులను ట్రస్ట్ వ్యవస్థాపకులు దాట్ల వెంకట్రామరాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది సెప్టెంబర్లో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్‌ను ప్రారంభించి మోక్షధామంలో దహన గదులు నిర్మించామన్నారు. కాళ్లకూరు గ్రామస్తులకు మంచి కార్యక్రమాలు చేయాలనే దృక్పథంతో ట్రస్టు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ట్రస్టు ద్వారా కాళ్లకూరులో మోక్షధామం ఆధునికీకరణ పనులు రూ.10 లక్షలతో చేపట్టడంతో సుందరంగా కనిపిస్తోందన్నారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు, పేద ప్రజల దహన సంస్కారాలకు, పేదల వివాహానికి, కంటి ఆపరేషన్లకు ఆర్థికసాయం అందజేస్తున్నామన్నారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో బొర్రా వెంకటేశ్వరరావు, చిటికెన సూర్యనారాయణ పాల్గొన్నారు.


మోక్షధామంలో ఆధునికీకరణ పనులను ప్రారంభించిన వెంకట్రామరాజు

రైతుల సొమ్ము ఇచ్చే వరకూ పోరుబాట ఆగదు

ప్రజాశక్తి - పాలకొల్లు

రైతుల నుంచి ప్రభుత్వం 5 కేజీలు అదనంగా తీసుకున్న సొమ్మును తిరిగి రైతులకిచ్చే వరకూ పోరుబాట ఆగదని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. ఈ నెల 12న చంద్రబాబు పర్యటన జిల్లాలో విజయవంతం కావాలని కోరుతూ టిడిపి కార్యాలయంలో శుక్రవారం రైతులతో సమావేశమయ్యారు. ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. అకాల వర్షాల వల్ల రైతులు ఇబ్బందులు పడగా కనీసం అధికారులు, మంత్రులు రాకపోవడంతో రైస్ మిల్లు వద్ద ధాన్యం కొనే పరిస్థితి లేదన్నారు. చంద్రబాబు జిల్లాలో వ ర్య టి ం చ గా నే అధికారులు, మంత్రులు పర్యటించి రైతులు ధాన్యాన్ని కొనే పరిస్థితి కలిగిందని చెప్పారు. 12న చంద్రబాబు తణుకు పర్యటనలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

తణుకు: ఈ నెల 12న తణుకు నియోజకవర్గంలో టిడిపి అధినేత చంద్రబాబునాయుడు చేపట్టనున్న రైతు పోరుబాటను విజయవంతం చేయాలని తణుకు మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరగవరం నుంచి ఉదయం ఎనిమిది గంటలకు పాదయాత్ర ప్రారంభమైన అక్కడ నుంచి తణుకు వైజంక్షన్ వరకూ కొనసాగుతుందని తెలిపారు. అనంతరం సాయంత్రం ఐదు గంటలకు వైజంక్షన్‌లోని ఆకుల శ్రీరాములు కళాశాల సమీపంలో బహిరంగ సభ జరుగుతుందని, రైతులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ప్రతిపక్షాల కార్యక్రమాల పట్ల మంత్రి కవ్వింపు చర్యలకు పాల్పడే విధంగా చంద్రబాబు పాదయాత్రకు పోటీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం అన్యాయమన్నారు. రైతులను అవమానించిన మంత్రికి రాబోయే రోజుల్లో రైతులు ప్రజలు తెగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు

కొనసాగిన వేసవి విజ్ఞాన శిబిరం


గోపాల్‌రెడ్డిని సత్కరిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

పొలమూరులో డివైఎఫ్ఐ, ఐద్వా సహకారంతో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏడో రోజు గురువారం వేసవి వినోదంలో భాగంగా రాష్ట్ర స్థాయి మెజీషియన్ గోపాల్‌రెడ్డి మ్యాజిక్ షో నిర్వహించారు. పిల్లలకు ఓజోన్ పొర ఆవశ్యకతను మేజిక్ ద్వారా వివరించారు. పిల్లల్లో దేశభక్తిని రేకత్తించే విధంగా జాతీయ జండాపై మాజిక్ చేసి నినాదాలు చెప్పించారు. అనంతరం ఐద్వా జిల్లా అధ్యక్షులు కేతా పద్మజ పిల్లలకు నీతి కథలు చెప్పారు. చింతపల్లి మావో పిల్లలకు మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. జాతీయ వైజ్ఞానిక దినోత్సవం సందర్భంగా మన దేశ వైజ్ఞానిక వేత్తల గురించి పిల్లలకు అవగాహన కల్పించారు. బాలల సంఘం పిల్లలు రాష్ట్ర స్థాయి మెజీషియన్ గోపాల్ రెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు భారతి, భారత్, ప్రమోద్, బాలల సంఘం నాయకులు పాల్గొన్నారు.

తణుకు : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక పురుషుల శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులు వివిధ రకాల పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుస్తక పఠనంతో పాటు క్రాఫ్ట్ పేపర్‌తో వివిధ కళాకృతులతో బొమ్మలు, ఫ్లవర్స్ తయారు చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు, వైసిపి నాయకులు తోట శ్రీనివాస్ గురువారం వైసిపికి రాజీనామా చేసి జనసేనలో చేరారు. తోట శీనుతో పాటు వివిధ పార్టీలకు చెందిన మరో 50 మంది జనసేన జిల్లా అధ్యక్షులు కోటికలపూడి గోవిందరావు, ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పచ్చమట్ల ధర్మరాజు సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జనసేన గెలుపు ఖాయమన్నారు. వైసిపి విధానాలకు విసుగెత్తిన కార్యకర్తలు, నాయకులు జనసేనలోకి చేరుతున్నారన్నారు. వైసిపికి రాజీనామా చేసి జనసేనలో చేరిన తోట శీను జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంటి వెలుగును ఉపయోగించుకోండి

ప్రజాశక్తి - గణపవరం

గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కంటి వెలుగును స్థానికులు ఉపయోగించుకోవాలని డి.కొండేపాడు గ్రామ సర్పంచి తూము వీర వెంకట నాగవేణి అన్నారు. గురువారం పిప్పర ప్రభుత్వాసుపత్రి ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రామాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా 60 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేత్ర వైద్యులు ఐ.శ్రీనివాస్, కంటి వెలుగులో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


సత్యనారాయణ కుటుంబానికి నిత్యావసరాలు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

బాధిత కుటుంబానికి పూర్వ విద్యార్థుల సాయం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణానికి చెందిన సతివాడ వెంకట సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధితుని స్నేహితులైన లూథరన్ హైస్కూల్ 2002-03 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆ కుటుంబానికి రూ.50 వేల నగదు, రెండు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు, బియ్యం గురువారం అందజేశారు. ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడానికి దాతలు ముందుకు రావాలని వారు కోరారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

పొన్నపల్లి రామలింగేశ్వరరావు, తండ్రి: వీర వెంకట సత్యనారాయణ అను నేను నాయొక్క పాస్‌పోర్టు పడిపోయినది. చించినాడ జిరాక్స్ షాపు నుండి ఏనుగువానిలంక తిరిగి వెళుతుండగా నా పాస్‌పోర్టు నెంబర్ **R4547180** గల పాస్‌పోర్టు పడిపోయినది. ఎవరికైన దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

అడ్రస్: పొన్నపల్లి రామలింగేశ్వరరావు
తండ్రి: వీర వెంకట సత్యనారాయణ
డోర్ నెంబర్: 4-71, ఏనుగువానిలంక,
యలమంచిలి మండలం, పిన్: 534275
సెల్: 8886433420

సమాచారమివ్వడంలో విఫలం : కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మిల్లర్ల గురించి వాస్తవ సాగుదారులకు క్షేత్రస్థాయిలో సమాచారమివ్వడంలో సంబంధిత అధికారుల లోపం తీవ్రంగా కనబడుతోందని కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. మినీ మిల్లర్స్ మండలానికి ఒకటి చొప్పున ఇస్తే ఎలా సరిపోతుందన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో ఇటు వంటి మినీ మిల్లర్స్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దీనివల్ల సాగుదారుడు సుమారు అరకిలో ధాన్యాన్ని రాశిలో నాలుగు పక్కల నుండి తీసుకొని వెళ్లి సంబంధిత టెక్నీషియన్‌కు ఇస్తే దాన్ని 250 గ్రాములు చొప్పున రెండుసార్లు మిల్లింగ్ చేస్తారని తెలిపారు. అనంతరం ఆ బియ్యాన్ని రెండూ కలిపేసి ఐదు పక్కల నుండి రెండు గ్రాములు చెప్పున 10 గ్రాముల బియ్యం తీసుకోవడం జరుగుతుందన్నారు. బియ్యాన్ని టేబుల్ పై వేసి ముక్కగా ఉన్నదాన్ని ఒక భాగంగా రెండో భాగం బియ్యంగా ఉన్నదాన్ని మూడు వంతులు ఉన్నదాన్ని కలిపి ఈ రెండు భాగాలను వేరువేరుగా తూకం వేయడం జరుగుతుందని తెలిపారు. గోనె సంచుల కొరత వల్ల ఎక్కువ రోజులు ఉన్నాగాని నూకల శాతం ఎక్కువగా రావడం జరుగుతుందన్నారు.

CHANGE OF NAME

I GANJI LAKSHMI NARAYANA, S/o. GANJI VENKATA SATYANARAYANA, Residing at Pavulurivarigudem, H/o. Tirumalampalem Village, Dwaraka Tirumala Mandal, Eluru District, AP Changing my Son Name from **GANJI NEHITH CHOWDARY** (Old Name) to **GANJI NAYAAN** (New Name). Henceforth today onwards my Son Name Called as **GANJI NAYAAN** (New Name) for all purposes.

నేరాల నియంత్రణకు చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి - మొగల్తూరు

జిల్లాలోని నేరాలను పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు చర్యలు చేపట్టామని ఎస్‌పి యు.రవిప్రకాష్ తెలిపారు. మొగల్తూరు పోలీస్‌స్టేషన్‌ను వార్షిక తనిఖీలో భాగంగా గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ సిబ్బందికి అందించిన కిట్లు, సిబ్బంది దేహదారుఢ్యాన్ని పరిశీలించారు. కెపిపాలెం బీచ్‌లో ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్ పోస్ట్‌ను చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో పలు కేసులను తక్కువ వ్యవధిలోనే ఛేధించి నిందితులను అరెస్ట్ చేశామన్నారు. పర్యాటక పోలీస్ విభాగంలో భాగంగా నర్సాపురం, మొగల్తూరు ప్రాంతాల్లో ఉన్న పద్దెనిమిది కిలోమీటర్ల మేర సముద్ర తీరాన్ని రక్షణ విధులు నిర్వహించేందుకు ఎస్ఐ, సిబ్బందిని నియమించనున్నామన్నారు. పోలీస్ ఔట్ పోలీస్ స్టేషన్‌కు దిశా వాహనాన్ని కేటాయించామని తెలిపారు. నేర సమాచారం తెలిస్తే ప్రజలు బాధ్యతగా తమకు తెలియజేయాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఆయన వెంట డిఎస్‌పి.రవి మనోహరాచారి, సిఐ వి.సురేష్ బాబు, ఎస్ఐ ఎం.వీరబాబు, మున్సిపల్ ఛైర్ పర్సన్ బర్రె వెంకటరమణ, జెడ్‌పిటిసి తిరుమాని బాపూజీ ఉన్నారు.



పేరుపాలెంబీచ్‌లో పోలీస్ ఔట్ పోస్టులు ప్రారంభిస్తున్న ఎస్‌పి, ప్రభుత్వ చీఫ్‌విప్

దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా, రావికంపాడు గ్రామంలో నివసిస్తున్న యడ్లపల్లి సత్యవతి, H/o. వెంకన్న (లేటు) కాపురస్తులు దేవులపల్లి గ్రామం నుండి లక్కవరం బ్యాంకు పని నిమిత్తం స్కూటర్‌పై వెళ్తుండగా మార్గ మధ్యములో మా ఇంటి యొక్క దస్తావేజుల కవర్ పడిపోయినది. ఎంత వెతికినను కనిపించలేదు. మా ఇంటి యొక్క దస్తావేజు నెం. 383/2004 (SRO). దొరికినవారు ఈక్రింది చిరునామాకు అందజేయవలసిందిగా కోరుతున్నాము.

అడ్రస్: యడ్లపల్లి సత్యవతి, H/o. వెంకన్న (లేటు)
రావికంపాడు గ్రామం, కామవరపుకోట మండలం
సెల్: 9492625645

పాలకొల్లులో అన్నదానం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎవిఎస్ కాలనీలోని లక్ష్మీగణపతి ధ్వజస్తంభ ప్రతిష్ట సందర్భంగా శుక్రవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. మూడు రోజులుగా ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాలు కొత్తలంక సత్యనారాయణ శివాచార్య నేతృత్వంలో వీరా హరిబాబు, ధనలక్ష్మి దంపతుల ఆర్థిక సహకారంతో నిర్వహించారు. మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, కావలి శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం అన్నమారాధన నిర్వహించారు.

PUBLIC NOTICE

Under instructions of my client, Smt. Pinjarla Venkata Lakshmi, W/o. Krishnarao, resident of H.No. 7C-9/1-3, Eastern Street, Behind Ganganamma Temple, 7th Division, Eluru, Eluru Dist., It is hereby informed to the Public in general that my client lost his Original Link Regd. Sale deed bearing Doct. No. 7783/1998, dated: 18-11-1998, SRO, Eluru, W.G.District, A.P., If the above original document is found to anybody, kindly return the same to the infra address.

It is hereby informed to the Public that the above Original Link Registered Sale deed vide bearing Doct. No. 7783/1998, dt: 18-11-1998 was lost at Govt. Hospital Road, Eluru while taking Xerox copies and same is not available, the above said original document should not be used by anyone for any transaction, if any transaction is doing, such transaction will not be bind my client in any manner, if anybody press the same into service, they will be prosecuting both civil and criminal as per law.

MANDRU RAJENDRA
Eluru Advocate, Eluru
Date: 11-05-2023 Cell: 9440117997

మహారాజశ్రీ ఏలూరు అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఐ.ఎ. నెం. 596/2022 ఇన్ (క్రెడిటార్) ఐ.పి. నెం. 17/2020

మధ్య:
పిల్లి రవీంద్ర జీవన్‌కుమార్
...పిటీషనర్/ పిటీషనర్
మరియు
1. నాగళ్ళ విఠల్‌కుమార్ (డైడ్)
2. కాళ్ళ ధనంజయరావు
3. ది అఫీషియల్ రిసీవర్, ప॥గో॥జిల్లా, ఏలూరు
...రెస్పాండెంట్స్/ రెస్పాండెంట్స్

చనిపోయిన 1వ రెస్పాండెంట్‌కు ప్రతిపాదిత రెస్పాండెంట్‌లు (వారసులు):
4. నాగళ్ళ ప్రవీణ
5. నాగళ్ళ చంద్ర
6. నాగళ్ళ సంధ్యారాణి

పై క్రెడిటార్ ఐ.పి. గ్రంధములో ఇందలి ప్రతిపాదిత రెస్పాండెంట్‌లను, చనిపోయిన 1వ రెస్పాండెంట్‌కు సంబంధించి లీగల్ రిప్రజంటేటివ్స్/ పార్టీలుగా చేర్చుటకు ఇందలి పిటీషనరు దాఖలు చేసిన పై ఐ.ఎ. 596/2020లో ది. 26-11-2020న కలిగిన ఎబేట్‌మెంట్‌ను రద్దు చేయుటకు వలసిన పిటీషన్ దాఖలు చేయుటలో కలిగిన 520 రోజులు ఆలస్యమును క్షమించమని దాఖలు చేసిన పిటీషనులో పై తెలిపిన 4 టు 6 ప్రతిపాదిత రెస్పాండెంట్‌లకు ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో స్వయంగా గాని, తమచే నియమింపబడిన ప్లీడర్ గారి ద్వారా గాని **ది. 16-06-2023న శ్రీ కోర్టు వారి ముందు ఉదయం 10 గం॥లకు** హాజరై తెలుపుకోవలసినదిగా శ్రీ కోర్టు వారు ది. 05-05-2023న ఆర్డరు చేసియున్నారు. కానిచో సదరు విషయము వారి పరోక్షమున శ్రీ కోర్టు వారు తీర్మానించుట జరుగునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

శియ్యాద్రి జగదీశ్వరరావు
స్థలం: ఏలూరు అడ్వకేట్, ఏలూరు
ది.10-05-2023 సెల్: 8956899999

మహారాజశ్రీ ఏలూరు అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఐ.ఎ. నెం. 598/2022 ఇన్ (క్రెడిటార్) ఐ.పి. నెం. 17/2020

మధ్య:
పిల్లి రవీంద్ర జీవన్‌కుమార్
...పిటీషనర్/ పిటీషనర్
మరియు
1. నాగళ్ళ విఠల్‌కుమార్ (డైడ్)
2. కాళ్ళ ధనంజయరావు
3. ది అఫీషియల్ రిసీవర్, ప॥గో॥జిల్లా, ఏలూరు
...రెస్పాండెంట్స్/ రెస్పాండెంట్స్

చనిపోయిన 1వ రెస్పాండెంట్‌కు ప్రతిపాదిత రెస్పాండెంట్‌లు (వారసులు):
4. నాగళ్ళ ప్రవీణ
5. నాగళ్ళ చంద్ర
6. నాగళ్ళ సంధ్యారాణి

పై క్రెడిటార్ ఐ.పి. గ్రంధములో ఇందలి ప్రతిపాదిత రెస్పాండెంట్‌లను, చనిపోయిన 1వ రెస్పాండెంట్‌కు సంబంధించి లీగల్ రిప్రజంటేటివ్స్/ పార్టీలుగా చేర్చుటకు ఇందలి పిటీషనరు దాఖలు చేసిన పై ఐ.ఎ. 598/2020 పిటీషనులో పై తెలిపిన 4 టు 6 ప్రతిపాదిత రెస్పాండెంట్‌లకు ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో స్వయంగా గాని, తమచే నియమింపబడిన ప్లీడర్ గారి ద్వారా గాని **ది. 16-06-2023న శ్రీ కోర్టు వారి ముందు ఉదయం 10 గం॥లకు** హాజరై తెలుపుకోవలసి నదిగా శ్రీ కోర్టు వారు ది. 05-05-2023న ఆర్డరు చేసియున్నారు. కానిచో సదరు విషయము వారి పరోక్షమున శ్రీ కోర్టు వారు తీర్మానించుట జరుగునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

శియ్యాద్రి జగదీశ్వరరావు
స్థలం: ఏలూరు అడ్వకేట్, ఏలూరు
ది.10-05-2023 సెల్: 8956899999

మహారాజశ్రీ ఏలూరు అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఐ.ఎ. నెం. 597/2022 ఇన్ (క్రెడిటార్) ఐ.పి. నెం. 17/2020

మధ్య:
పిల్లి రవీంద్ర జీవన్‌కుమార్
...పిటీషనర్/ పిటీషనర్
మరియు
1. నాగళ్ళ విఠల్‌కుమార్ (డైడ్)
2. కాళ్ళ ధనంజయరావు
3. ది అఫీషియల్ రిసీవర్, ప॥గో॥జిల్లా, ఏలూరు
...రెస్పాండెంట్స్/ రెస్పాండెంట్స్

చనిపోయిన 1వ రెస్పాండెంట్‌కు ప్రతిపాదిత రెస్పాండెంట్‌లు (వారసులు):
4. నాగళ్ళ ప్రవీణ
5. నాగళ్ళ చంద్ర
6. నాగళ్ళ సంధ్యారాణి

పై క్రెడిటార్ ఐ.పి. గ్రంధములో ఇందలి ప్రతిపాదిత రెస్పాండెంట్‌లను, చనిపోయిన 1వ రెస్పాండెంట్‌కు సంబంధించి లీగల్ రిప్రజంటేటివ్స్/ పార్టీలుగా చేర్చుటకు ఇందలి పిటీషనరు దాఖలు చేసిన పై ఐ.ఎ. 597/2020లో ది. 26-11-2020న కలిగిన ఎబేట్‌మెంట్‌ను రద్దు చేయుటకు దాఖలు చేసిన పిటీషనులో పై తెలిపిన 4 టు 6 ప్రతిపాదిత రెస్పాండెంట్‌లకు ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో స్వయంగా గాని, తమచే నియమింపబడిన ప్లీడర్ గారి ద్వారా గాని **ది. 16-06-2023న శ్రీ కోర్టు వారి ముందు ఉదయం 10 గం॥లకు** హాజరై తెలుపుకోవలసినదిగా శ్రీ కోర్టు వారు ది. 05-05-2023న ఆర్డరు చేసియున్నారు. కానిచో సదరు విషయము వారి పరోక్షమున శ్రీ కోర్టు వారు తీర్మానించుట జరుగునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

శియ్యాద్రి జగదీశ్వరరావు
స్థలం: ఏలూరు అడ్వకేట్, ఏలూరు
ది.10-05-2023 సెల్: 8956899999